క్లుప్తంగా

మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీల బ్రోచర్ విడుదల



బ్రోచర్, కప్ విడుదల చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: ఈ నెల 25వ తేదీన ఓల్డ్ ఐటీఐ జంక్షన్ వద్ద గల భవానీగార్డెన్స్ లో మిస్టర్ ఆంధ్ర ఓపెన్ చాలెంజ్ (జోనల్) బాడీబిల్డింగ్–2024 పోటీలు జరగనున్నాయి. నవ్య ఆంధ్రప్రదేశ్ ఫిట్‌నెస్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆదివారం నక్కవానిపాలెంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ విడుదల చేశారు. పలు విభాగాల్లో 7 గ్రూప్ లుగా పోటీలు నిర్వహించనున్నారు.కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

మనసు ఆశ్రమానికి సరకుల వితరణ



సరకులు అందిస్తున్న బెహరా భాస్కరరావు, బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ మూర్తి

గోపాలపట్నం: జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలోని మనసు పిల్లల ఆశ్రమానికి నిత్యావసర సరకులను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అందించారు. ఎన్‌ఏడీ జంక్షన్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడా యాజమాన్యం నెల రోజులకు సరిపడా గ్రాసంతో పాటు వాటర్ ఫిల్టర్‌ను సమకూర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనసు వంటి స్వచ్ఛంద సంస్థలకు సాయం అందివ్వాలని కోరారు. బ్రాంచ్ మేనేజర్ ఎంవీ సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ బ్యాంక్ యాజమాన్యం సహకారంతో ఈ సరకులు అందించామని తెలిపారు. ది అడివివరం కో ఆపరేటివ్ బ్యాంక్ సొసైటీ డైరెక్టర్ గేదెల మురళీ కృష్ణ, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రదర్శనలతో ప్రతిభ వెలుగులోకి



విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకిస్తున్న సీఐ సన్యాసినాయుడు

మల్కాపురం: పాఠశాల స్థాయిలో విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తుందని సీఐ సన్యాసినాయుడు అన్నారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా 60వ వార్డు ఏవీకే పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నేటి రోజుల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులు చేసిన ప్రతి పరిశోధన ఈ దేశానికి కీర్తిని పెంచే విధంగా ఉండాలన్నారు.తల్లిదండ్రుల తమ పిల్లల ఇష్టాలను గుర్తించి ఆ అంశంలో వారిని ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఏవీకే పాఠశాల కరస్పాండెంట్ పి.మానసత్రినాథ్,వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి

డాబాగార్డెన్స్ : ప్రముఖ సాంస్కృతిక సంగీత సేవా సంస్థ మెలోడీ క్రియేటర్స్‌చే ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. చందురుని మించు అందమొలికించు పేరిట నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని కొణతాల రాజు, సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరానికి చెందిన సీనియర్ గాయకుడు పి. రాము అలనాటి తెలుగు చలన చిత్రాల్లోని పలు గీతాలను సహచర గాయనీ గాయకులతో మధురంగా ఆలపించారు.

వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు

కండువాలు కప్పి ఆహ్వానించిన ఆడారి ఆనంద్‌కుమార్



మహిళను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆనంద్‌కుమార్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింధియా: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజానాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరుగుతూనే ఉన్నాయి. పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు కొనసాగుతున్నాయి. ప్రజాసంకల్ప యాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అధికారం చేపట్టిన తర్వాత నెరవేర్చడంతో ఆకర్షితులై పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతుంటే, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా జరగని సంక్షేమం కేవలం సీఎం జగన్ ప్రభుత్వంలోనే జరుగుతుందని నమ్మి స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని ఎన్టీఆర్‌కాలనీ, హుద్‌హుద్‌కాలనీ ప్రాంతాల నుంచి సుమారు 100 మంది మహిళలు, యువకులు వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరగా, వారికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల కోసం కాకుండా పొత్తుల కోసం తాపత్రయపడుతూ పూటకో మాట, రోజుకోక యూటర్న్ తో ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని చంపేసిన నాయకుడు చంద్రబాబు అని దుయ్యబట్టారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో రాజకీయ లబ్ధి కోసం తిరిగి టీడీపీతో పొత్తు పెట్టుకుని రంగులేని డ్రామాలతో దొంగదీక్షలు, వారాహి యాత్రలతో ప్రజల చెవుల్లో పూలుపెడుతున్న పవన్ కల్యాణ్‌పై సొంత పార్టీ నేతలే విరక్తి చెంది ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని జనం నమ్మడంతో పార్టీలో చేరేవారి సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. రాష్ట్రంలో 90 శాతానికి పైగా పంచాయతీలు, మున్సిపాలిటీల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారని, దాంతోనే ప్రజలు సీఎం జగన్ పాలనను ఎంతగా స్వాగతిస్తున్నారో అర్థమవుతుందన్నారు.పశ్చిమ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా మారుస్తామన్నారు. కార్యక్రమంలో మూడు జిల్లాల వైఎస్సార్‌టీయూసీ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్, 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, నాయకులు గంటా వర్మ, భోగవిల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనం సీఎం జగన్



40వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

- పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్
- 40వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సింధియా: రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ ఫలాలను అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీ ఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధిలోని షిప్‌యార్డ్‌కాలనీ, ఏకేసీకాలనీలో సుమారు రూ. 76 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడవద్దని సూచించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలో మరెన్నో అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించామని, వాటిని కూడా త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పరిపాలన సాగిస్తున్న సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే సంక్షేమ పథకాలు అమలవుతాయని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో మూడు జిల్లాల వైఎస్సార్‌టీయూసీ ఇన్‌చార్జి కలిదిండి బద్రీనాథ్, షిప్‌యార్డ్ అధికారులు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నీచ రాజకీయాలు మానుకోండి

టీడీపీ నేతలకు కార్పొరేటర్ గుండపు హితవు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు

సింధియా: టీడీపీ నాయకులు మరింత నీచానికి దిగజారుతున్నారని.. వైఎస్సార్‌సీపీతో సంబంధంలేని వ్యక్తులను తీసుకువచ్చి టీడీపీలో చేరారని అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలు వాటిని నమ్మే స్థితిలో లేరని అన్నారు. తాజాగా టీడీపీలోకి చేరారని చెబుతున్న గేదెల రాజుకి వైఎస్సార్‌సీపీకి సంబంధంలేదన్నారు. టీడీపీ నాయకులు కుట్రపూరిత రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్ గెలవడం ఖాయమన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

సీఐ సన్యాసినాయుడు



యువతతో మాట్లాడుతున్న సీఐ సన్యాసినాయుడు

మల్కాపురం: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేదిలేదని, బహిరంగ ప్రదేశాల్లో యువత ఇబ్బందికరంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మల్కాపురం సీఐ సన్యాసినాయుడు హెచ్చరించారు.స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఆదివారం ఆయన పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి గస్తీ నిర్వహించారు. మల్కాపురం పాత పెట్రోల్ బంక్ వద్ద, శ్రీహరిపురం మైదాన ప్రాంతంలో,ప్రకాష్‌నగర్,దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆరుబయట మద్యం,ధూమపానం చేస్తున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆ యువత తల్లిదండ్రులను పిలిపించి వారు చేస్తున్న చేష్టలను వివరించారు. మరలా ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటాం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అనే నినాదంలో ఉద్యమ ఫలితంగా ఏర్పడిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న 1,088వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో ఆదివారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి

ఎస్టీయూ జిల్లా కార్యదర్శి పైడిరాజు

విశాఖ విద్య: ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా మారాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఇమంది పైడిరాజు అన్నారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సౌత్ ఇండియా స్థాయి సైన్సు ఫెయిర్‌లో ఉపాధ్యాయ కేటగిరీలో రాష్ట్రం నుంచి మొదటి బహుమతి సాధించిన జిల్లాలోని గంగవరం జెడ్పీ హైస్కూల్ సైన్సు ఉపాధ్యాయుడు పి. రాజారావును ఘనంగా సన్మానించారు. సైన్సు పరిశోధనల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే కాకుండా, నిత్య విద్యార్థిలా సరికొత్త ప్రయోగాలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇతర ఉపాధ్యాయులకు రాజారావు మాస్టారు కృషి స్ఫూర్తిదాయకమని అభినందించారు.

జిల్లా కార్యదర్శిగా పైడిరాజు

ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యదర్శిగా అడవరం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్న పైడిరాజు సేవలు జిల్లాలో మరింత వినియోగించుకునేలా కీలకమైన కార్యదర్శి పోస్టులో ఎంపిక చేశారు.

త్రీస్టార్స్ వాకర్స్ క్లబ్‌లో మెడికల్ క్యాంప్



ఇండస్ట్రియల్ ఏరియాలో పర్యటిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ త్రీస్టార్స్ వాకర్స్ క్లబ్‌లో కాపు, తెలగ, బలిజ జన ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులు వైఎస్సార్‌సీపీ ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాల సమన్వయకర్తలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్ కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. వైద్యులు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ఇండస్ట్రియల్ ఏరియాలో కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్ పర్యటించారు. కార్యక్రమంలో 54, 57 వార్డుల కార్పొరేటర్లు సిహెచ్.రజిని, ఎం.వాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాయిత పైడిరత్నాకర్, నూకరాజు, చిరంజీవి, బాబ్జి, సుకుమార్, త్రీస్టార్స్ వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణకు సహకారం

దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా



మేళాను ప్రారంభిస్తున్న రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రేమ్ ప్రకాష్

పరవాడ: భారతీయ వారసత్వం, సంస్కృతిని ప్రోత్సహించడం, సమాజ ఉద్ధరణ కోసం సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని దీపాంజలినగర్ దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా అన్నారు. దీపాంజలినగర్ సాధన క్రీడా మైదానంలో లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆనంద్ మేళాను రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెస్ట్–1 ప్రేమ్ ప్రకాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సంజయ్ కుమార్ సిన్హా, దక్షిణ దీపాంజలి సమితి మీను బాత్రా పాల్గొన్నారు. దీపాంజలినగర్ దీపికా లేడిస్ క్లబ్ అధ్యక్షురాలు అంజు మహిళా సాధికారిత దిశగా చేపట్టిన సీఎస్సార్ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిభను కనబర్చిన విద్యార్థులకు సైకిళ్లు అందించారు. దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రజారోగ్యానికి పెద్దపీట



భూమి పూజలో పాల్గొన్న ఆనంద్ కుమార్



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఆనంద్ కుమార్

- ఆహ్లాదకర వాతావరణం కోసం పార్కుల అభివృద్ధి
- ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుకు ప్రాధాన్యం
- ప్రజావసరాల మేరకు అభివృద్ధి పనులు
- ఏపీఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ ఆనంద్ కుమార్

విశాఖ విద్య: ప్రజారోగ్య పరిరక్షణ, ఆహ్లాదకరమైన వాతావరణం సమకూర్చడమే లక్ష్యంగా పార్కులు అభివృద్ధి చేస్తున్నట్లు ఏపీఎంఎస్‌ఎంఈడీసీ చైర్మన్ ,వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్‌లోని పవర్ స్టేషన్ దగ్గర పంచతత్వ పార్కు ప్రాంగణంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. లక్ష్మీనగర్, ఏపీఎస్ఈబీ కాలనీ, అల్లూరి సీతారామరాజు కాలనీ వాసుల విన్నపం మేరకు పంచతత్వ పార్కును అభివృద్ధి చేశారు. పార్కు ప్రాంగణంలో అదనపు హంగులు కల్పించేలా రూ. 15 లక్షలతో బ్యాడ్మింటన్ కోర్టు గ్రిల్స్, పార్కు ప్రాంగణంలో రూ. 12 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. వార్డు నాయకులు, కాలనీ అసోసియేషన్ పెద్దలతో కలసి ఆదివారం వీటిని ఆడారి ఆనంద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజావసరాల మేరకు పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

పార్కుల అభివృద్ధితో పాటు ఓపెన్ జిమ్‌ల ఏర్పాటుతో అన్ని వర్గాల వారికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఆరోగ్య పరిరక్షణకు పిల్లలకు, పెద్దలకు వ్యాయామం తప్పనిసరి అన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. 90వ వార్డు నాయకులు నమ్మి శ్రీను, చుక్క ప్రసాదరెడ్డి, స్థానిక కార్పొరేటర్ బొమ్మిడి రమణ, క్లస్టర్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, విశాఖ జేసీఎస్ కోఆర్డినేటర్ కిరణ్ రెడ్డి, శ్రీనివాస్ రాజు , సచివాలయ కన్వీనర్లు వై.వెంకటేశ్వరరావు, బోర అప్పల రెడ్డి, సత్యం, శ్రీను,గోవింద్, రమేష్, సన్యాసిరావు, . పైడి రెడ్డి, నమ్మి ఎర్రాజి, శ్రీను, వినీత రెడ్డి, పుష్పలత పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జీవీఎంసీ 90వ వార్డు రెడ్డి వీధి రామాలయం ప్రాంగణంలో రూ.15 లక్షలతో చేయనున్న అభివృద్ధి పనులకు ఆనంద్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో రాములవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఆధ్యాత్మిక బావాన్ని అలవాటు చేసుకోవాలన్నారు.

సందడిగా పరస

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



స్వామివారి మూలవిరాట్

గోపాలపట్నం: ఆర్.ఆర్ వెంకటాపురంలోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ 29వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం పరస నిర్వహించారు. రెండు రోజులుగా ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. శనివారం శివపార్వతుల కల్యాణం జరిగింది. ఆదివారం ఉదయం నుంచి విశేషంగా భక్తులు తరలివచ్చి అభిషేకాలు చేశారు. సాయంత్రం 5 గంటలకు స్వామికి సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామంలో జరిగిన పరసతో సందడిగా మారింది. ఈ సందర్భంగా ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు బుర్రకథ, అలరించాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

ప్రజలకు చేరువగా 'ఆడారి'



కొత్తపాలెంలో పింఛన్ నగదు అందిస్తున్న గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు తదితరులు

గోపాలపట్నం: నియోజకవర్గ ప్రజల కష్టాలను, ఇబ్బందులను పట్టించుకుని బాధ్యతగా వ్యవహరిస్తున్న నాయకుడు వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అని 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ అన్నారు. జీవీఎంసీ 89వ వార్డులో సాంకేతిక కారణాల వల్ల పింఛను రాని వారికి ఆడారి ఆనంద్‌కుమార్ సమకూర్చిన పింఛను నగదును ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనంద్‌కుమార్ తనసొంత నిధులతో నియోజకవర్గంలో పలువురికి పింఛన్లు అందివ్వడం చాలా గొప్పవిషయమన్నారు. వార్డులో 11 మందికి రూ. 3000 చొప్పన అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, నాయకులు కె. కిరణ్, రెహమాన్, దాడి ఆదినారాయణ, ఎస్ శ్రీను, రమణమ్మ, పి. విజయ్, ఎన్. చిన్ని, సత్యనారాయణ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు నవమి పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

కంచరపాలెం : జ్ఞానాపురంలోని కాన్వెంటు కూడలిలోని వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం పుష్య మాస శుద్ధ నవమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ పరిసరాల్లో వంటా వార్పు చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, తదితర సిబ్బంది సౌకర్యాలను పర్యవేక్షించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రఘునాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.